హాకీ సమ్మర్ క్యాంప్ ప్రారంభం

విశాలాంధ్ర - నక్కపల్లి : మండలంలో కేంద్రం లోఅనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు హాకీ క్రీడా ప్రాంగణంలో డిస్టిక్ స్పోర్ట్స్ ఆధారిటి అధికారి వెంకటరమణ ఆధ్వర్యంలో కోచ్ రాంబాబు పర్యవేక్షణలో సమ్మర్ హాకీ కోచింగ్ క్యాంప్ ప్రారంభం అయింది. ఈ సందర్భంగా డిఎస్డివో వెంకట రమణ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులుకు ఈ సమ్మర్ హాకీ కోచింగ్ క్యాంపు అన్ని విధాలా ఉపయోగం అని ఇప్పటికే ప్రతి రోజు ఉదయం 5 నుండి 7 వరకు సాయంత్రం 4 నుండి 6 వరకు ఈ క్యాంపు కొనసాగుతుంది అని నక్కపల్లి పరిసర ప్రాంత క్రీడాకారులుకు హాకీలో ప్రత్యేకంగా తర్ఫీదు ఇవ్వడం జరుగుతుంది అని, బియస్ హాకీ ఫౌండర్ సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, కార్యదర్శి తాతాజీ, నానాజీ, రామచంద్రరావు, రజిత్, క్రీడాకారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాలు రానున్న సందర్భంగా పోలీసులు అప్రమత్తతో వ్యవహరించాలి

జిల్లా ఎస్పీ కె.వి.మురళీక్రిష్ణ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : జూన్ 1 నుంచి ఎగ్జిట్ పోల్స్, 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు రానున్న సందర్భంగా, తదుపరి రోజుల్లో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా జిల్లాలోని పోలీసు అధికారులు , సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ మురళీకృష్ణ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ ర్యాలీలు, ఊరేగింపులు, పండుగలలో స్టేజ్ ప్రోగ్రాములకు అనుమతులు లేవని, పెట్రోల్ బంకులలో లూజ్ పెట్రోల్ అమ్మకాలు అనుమతించ కూడదని, బాణసంచా తయారీ దుకాణాలను తనిఖీ చేయాలని, వాటి అమ్మకాలపై నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు.రౌడీ షీటర్ల పై ప్రత్యేక నిఘా పెట్టడం జరిగింది. వారు ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే జిల్లా నుంచి బహిష్కరించడం జరుగుతుందని హెచ్చరించారు. గ్రామాల్లో దాబాలు, హొటల్లు, పాన్ షాప్ లలో అక్రమ మద్యం లభ్యం కాకుండా, జూదం కోడిపందాలు కాయిన్ గేమ్, బెట్టింగ్ మొదలైన చట్ట విరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో పోలీసు పికెట్, పెట్రోలింగ్, చెక్ పోస్టులను ప్రణాళికతో ఏర్పాటు చేయడం జరుగుతుంది. అసాంఘిక కార్యక్రమాలను ప్రోత్సహించే వారు, ప్రజలను ఇబ్బంది పెట్టేవారిని గుర్తించి, వారి కట్టడి కి బైండ్ ఓవర్ చెయ్యాలని సూచించారు. ఎస్.హెచ్.ఒ / ఇన్స్పెక్టర్లు గ్రామ స్థాయి లోని వివిధ వర్గాల ప్రజలతో సమావేశాలు నిర్వహించి, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, సెక్షన్ 144, 30 పోలీస్ యాక్ట్, బౌండ్ డౌన్ గురించి వివరించి, చట్టాలను ఉల్లంఘించిన ఎడల ఉల్లంఘన (బాండ్ల జప్తు), వాటి పరిణామాలు, చట్టపరంగా తీసుకునే కఠిన చర్యల గురించి వివరించాలని పోలీస్ అధికారులకు తెలియజేశారు. ప్రజలను రెచ్చగొట్టే సందేశాలు, నిరాధార ఆరోపణలు మొదలైన వాటిని సామాజిక మాధ్యమాల వేదికపై ప్రచారం చేయకూడదని అలా చేసిన ఎడల కఠినమైన చర్యలు తీసుకోబడతాయని తెలియజేయడం జరిగింది.అనుమతి లేని ర్యాలీలు, ఊరేగింపులు / సమావేశాలు, బాణసంచా పేల్చడం నిషేధం అని, అలాంటివి ప్రోత్సహించి, నిర్వహించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. 2014 ,2019, సాధారణ ఎన్నికలు 2021 స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఎఫ్.ఐ.ఆర్ , ఇతర రికార్డులలో మునుపటి ఎన్నికల నేరాలు నిందితులను గుర్తించి, వారి ప్రస్తుత కార్యకలాపాలను నిఘా ఉంచి అటువంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అభ్యర్థుల గెలుపు, ఓటములపై బెట్టింగ్‌లు నిర్వహించడం పాల్గొనడం నేరం. అటువంటి వారిపై నిఘా ఉంచడమే కాక చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని పోలీస్ అధికారులు వారి సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, తమ తమ అధికార పరిధిపై పూర్తి నియంత్రణ కలిగి ఉండాలని, తమ పరిధిలోని లాడ్జీలు, చౌల్ట్రీలు, కల్యాణ మండపం మొదలైన చోట అపరిచిత వ్యక్తులు అనుమానిత వ్యక్తులను ఎప్పట ికప్పుడు క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ ఎలాంటి అవాంఛనీ యమైన సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ లు అనుమానాస్పద గ్రామాల్లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ లు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయ భాస్కర్, పి. సత్యనారాయణ రావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్.అప్పలరాజు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్య నారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్, డిటిసి డీఎస్పీ డి.రామ వర్మ, దిశా డీఎస్పీ శ్రీ ఎం.ఉపేంద్ర బాబు, ట్రైనీ డీఎస్పీ శ్రీమతి భవ్య, ఇనస్పెక్టర్ లు లక్ష్మణమూర్తి, చంద్ర శేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, గణేష్, సతీష్, మన్మధరావు, ఎస్సైలు రామారావు, రఘువర్మ పాల్గొన్నారు.

అరట్లకోటలో హెచ్ఐవి పై అవగాహన

విశాలాంధ్ర - పాయకరావుపేట : ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో మండలంలోని అరట్లకోట గ్రామంలో అంతర్జాతీయ ఎయిడ్స్ దీప స్మృత్యాంజలి దినం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్ జి.సిహెచ్. నం 'సింగరావు హెచ్ఐవి పై అవగాహన నిర్వహించారు. వ్యాధి వ్యాపించే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా ఉండాలని కోరారు. హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలు గురించి వివరించారు.

160 మందికి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - కసింకోట : విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సారధ్యంలో అనకాపల్లి జిల్లా అందత్వ నివారణ సంస్థ సౌజన్యంతో అనకాపల్లి జిల్లా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మధు సత్య శ్రీ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం కసింకోట శివాలయం గవర్నమెంట్ హై స్కూల్లో ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్య అతిథులుగా ఏపీ స్టేట్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫౌండర్ సెక్రెటరీ ఎం శ్యాం ప్రసాద్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎస్వీ రమణ పాల్గొన్నారు. ముందుగా అతిథులు చేతుల మీదుగా మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి 160 మంది రోగులు వచ్చారని వారందరికీ భోజన సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని ప్రతినిధులు తెలిపారు. ఈ 160 మందిలోని 90 మందిని వెంటనే ఆపరేషన్ తీసుకెళ్లారు మిగతా వారికి మెడిసిన్ ద్వారా ట్రీట్మెంట్ చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో పుట్ట మురళీ కృష్ణ, రాజు, పుట్టా రవి, కలగా శివ నాయుడు, సురేష్, శంకర్ ఫౌండేషన్ ఇంచార్జ్ అరుణ్, స్టాఫ్ పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

విశాలంధ్ర - అచ్యుతాపురం : సీపీఎం వ్యవస్థాపక కార్యదర్శి పుచ్చల పల్లి సుందరయ్య 39వ వర్ధంతి సంద ర్భంగా ఆదివారం హరిపాలెం గ్రామంలో సిపిఎం సీనియర్ నాయ కులు ఎస్ కనుమనాయుడు పతకావిష్కరణ చేయగా సుందరయ్య చిత్రపటానికి సిపిఎం నాయకులు కే రామ సదాశివరావు, మండల కన్వీనర్ ఆర్.రాము పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించి, తెలంగాణలో నైజాం నవాబ్ కు వ్యతిరేకంగా రైతాంగ పోరాటం చేసి పదివేల ఎకరాల భూమిని పేదలకు పంచారని, ప్రజాసేవకు అంకితమై చట్టసభలకు సైకిల్ పై వెళ్లిన నిరాడంబరుడని, నిస్వార్థంగా ప్రజా సేవ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో హరిపాలెం శాఖ కార్యదర్శి బి.రామకుమార్, పుష్ప, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

రాష్ట్ర కార్యదర్శి బుద్ద కాశీ విశ్వేశ్వరరావు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : రాష్ట్రంలోని విశ్రాంత ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలన్నీ వెంటనే చెల్లించడానికి అధికారులు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బుద్ద కాశీ విశ్వేశ్వరరావు కోరారు. రింగు రోడ్డులో ఉన్న పీఆర్టీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయ, విశ్రాంత ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకుండా ఏళ్ల తరబడి కాలయాపన చేస్తున్నారన్నారు. పీఆర్సీ, డీఏ బాకాయిలను విడుదల చేయాలన్నారు. 2018 నుంచి గ్రాట్యూటీ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. గత పీఆర్సీలో రూ.16 లక్షలకు గ్యాట్యూటీని పెంచారన్నారు. 2022 జనవరి తరువాత వారికి మాత్రమే దీనిని అమలు చేశారన్నారు. పీఆర్సీ సూచనల మేరకు 2018 నుంచి పెంచిన గ్యాట్యూటీని చెల్లించాల్సి ఉందన్నారు. 2018 తరువాత పదవీ విరమణ చెందిన వారికి పెరిగిన మొత్తాన్ని వెంటనే చెల్లించాలన్నారు. పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల కమ్యుటేషన్ మొత్తాన్ని 15 సంవత్సరాల నుంచి ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధంగా 12 ఏళ్లకు అమలు చేయాలన్నారు. 70 ఏళ్లు దాటిన విశ్రాంత సిబ్బందికి వర్తించే క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ను ఇతర రాష్ట్రాలు, గతంలో ఉన్న విదంగా 10 శాతంకు పెంచాలన్నారు బోధనేతర విధుల నుంచి ఉపాధ్యాయులను పూర్తిగా తొలగించాలన్నారు. నాడు నేడు పనులను ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించాలన్నారు. పాఠశాలల్లో కంప్యూటర్, సెల్ ఫోన్ పనులు తదితర అన్ని బోదనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులకు విముక్తిని కల్పించి, పూర్తి సమయం బోధనకు కేటాయించాలన్నారు. అప్పుడే ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి పూర్తి స్థాయి బాధ్యత వహిస్తారన్నారు. బోధనేతర కార్యక్రమాలు అప్పగిస్తూ బోధన గురించి లేని పోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అన్ని పనులకు ఉపాధ్యాయులను బాధ్యులుగా చేసి వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. బోధనకు క్రింది స్థాయి ఉపాధ్యాయుడు నుంచి పై స్థాయి అధికారులు వరకూ అందరూ బాధ్యులేనన్నారు. లాభం జరిగినా, పేరు వచ్చినా దీనిని అధికారులు, ప్రభుత్వానిదిగా చెపుతూ ఎక్కడైనా లోపాలు ఉన్నా, ఆరోపణలు ఉన్నా దీనికి ఉపాధ్యాయులనే ఎలా బాధ్యులుగా చేస్తారని ఆయన ప్రశ్నించారు. విధానం, వ్యవస్థలో లోపాలు ఉంటే దీనికి ఉపాధ్యాయులతో పాటు ఉన్నత స్థాయి అధికారులు వరకూ అందరూ సమాన బాధ్యులేనన్నారు. ఇంత వరకూ అధికారులు చెప్పినట్లే, ఆదేశించినట్లే ఉపాధ్యాయులు నడుచుకుంటున్నారని ఆయన వివరించారు. సంఘ ప్రతినిధులు వరం, బాబ్జీ, కామేశ్వరరావు, మూర్తి, గంగాధర్, జనార్ధన్, రమేష్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎందరో జీవితాల్లో వెలుగు నింపిన పీవీజెఆర్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి పీలా వెంకట జగ్గారావు అని వక్తలు కొనియాడారు. ఈ నెల 14న మృతి చెందిన శ్రీ నూకాంబికా అమ్మవారి దేవస్థానం మాజీ ఛైర్మన్, వ్యాపారవేత్త, స్వచ్ఛంద సేవకులు దివంగత పీలా వెంకట జగ్గారావు (పీవీజెఆర్)కు శనివారం రాత్రి జరిగిన సంతాప సభలో పట్టణ ప్రజలు నివాళులర్పించారు. శ్రీ గౌరీ గ్రంథాలయంలో జరిగిన సంతాప సభలో ఆయన చిత్రపటానికి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎంఎల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, అత్యంత ఆప్తులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జగ్గారావుతో ఉన్న అనుబంధాన్ని అందరూ నెమరువేసుకున్నారు. అనంతరం సభలో మాజీ మంత్రి 'దాడి' మాట్లాడుతూ . ఎటువంటి అధికార పదవులు లేకపోయిన ఎంతో మంది నిరుపేదలకు ఉపాధి కల్పించిన జగ్గారావు మహనీయుడని అన్నారు. రాజకీయాలకు, కులాలకు, మతాలకు అతీతంగా తన ఆదాయంలో 50 శాతంకు పైగా సేవా కార్యక్రమాలకు ఆర్ధికంగా చేయూత నిచ్చారని చెప్పారు. క్రీడలపట్ల ఎంతో ఆసక్తి గల ఆయన చిన్నతనంలో తనకు లభించని ఆటలాడే అదృష్టాన్ని ఈ నాటి యువతకు, బాలలకూ అందుబాటులోనికి తేవటానికి తన వంతు సాయం అందించేవారన్నారు. మాజీ ఎంఎల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ. చిన్నతనం నుంచీ ఆర్ధిక సమస్యలు, కష్టాలు తెలిసిన వ్యక్తిగా నేడు ఆర్ధికంగా అగ్ర స్థానానికి చేరినా తాను పడిన కష్టాలు మరవక, అలాంటి కష్టాలు పడేవార్ని ఆదుకుంటూ ఆపత్సమయాలలో పిలవకనే పలికే పేదల పెన్నిధి పీలా వెంకట జగ్గారావు కీర్తి సాధించారని అన్నారు. శ్రీ జగన్నాధస్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ దాడి ఈశ్వరరావు మాట్లాడుతూ. వణిక్ ప్రముఖునిగా, స్వచ్ఛంద సేవకునిగా, పేద ప్రజలకు తోడునీడగా ఉన్న జగ్గారావు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి చేసిన కృషి, దీక్ష, పట్టుదలా నేటి యువతకు ఆదర్శప్రాయమైందన్నారు. ఆర్ధిక కష్టంతోగానీ, మరేదైనా సమస్యతోగానీ తనవద్దకు వచ్చిన పరిచయస్తులను, ఆర్తులనూ కాదని ఎరుగరని తగిన సాయం చేసి చిరునవ్వుతో వీడ్కోలు ఇవ్వటం జగ్గారావు తత్వమన్నారు. ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలెన్నింటికో చేతికి ఎముకలేనట్టు విరాళాలు ఇచ్చి సంస్థల అభివృద్ధికి దోహదపడ్డారాన్నరు. కార్యక్రమంలో శ్రీ గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, అధ్యక్షుడు దొడ్డి నూకఅప్పారావు, మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, సినీ నిర్మాత పీలా తిలక్, మాజీ కౌన్సిలర్లు, ప్రజా సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ఆయన అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా కామ్రేడ్ సుందరయ్య వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర - నక్కపల్లి : నక్కపల్లిలో కామ్రేడ్ సుందరయ్య గారి 39 వ వర్ధంతిని ఘనంగా సీఐటీయూ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. అప్పలరాజు సుందరయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ ప్రజా సేవ కోసం నిరంతర అలుపెరుగనిపోరాటం చేసి, దక్షిణ భారత దేశములో కమ్యూనిస్టు పార్టీ ని బలోపేతం చేసిన నాయకుడిగా పేరుపొందారు. ప్రజా సేవ కోసం పిల్లలను కనకుండా, ప్రజా పోరాటానికి తన జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి అని అన్నారు. అయన ఆశయాలు కోసం నేడు యువత కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం. రాజేష్, ఎం. నానాజీ, ఆటో యూనియన్ నాయకులు అడ్డురి వెంకన్న,వెంకటరమణ,కె. అప్పారావు,బాబ్జి, సంతోష్

రాంబిల్లి : పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలను మండల కేంద్రమైన రాంబిల్లి సిపిఎం శ్రేణులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆదివారం నాడు ఆయన చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు, రుత్తల రాంబాబు చేతుల మీదుగా పూలమాలవేసి పార్టీ నాయకులు నివాళులర్పించారు. అనంతరం సిపిఎం మండల కన్వీనర్, జి దేవుడు నాయుడు మాట్లాడుతూ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య మహోన్నతమైన నేతని కొనియాడారు. ఆయన త్యాగాలు, పోరాట పటిమ, నిర్మాణ దక్షత ఈ తరం కమ్యూనిస్టులకు ఎంతో అవసరమని అన్నారు. సుందరయ్య లాంటి ప్రజా ప్రతినిధులు నేడు భారతదేశంలో కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.సుందరయ్యకు నివాళులర్పించడమంటే, ఆయన ఆశయ సాధనలో మనమంతా ముందుకు సాగడమేనని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, నాగు మంత్రి నారాయణరావు, చింతకాయల శివాజీ, చందక రామకృష్ణ, రుత్తల రాంబాబు, వాసు, శ్రీను, నరేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సమీక్షా సమావేశం

మండలాలు వారిగా సమీక్షలు

ఎమ్మెల్యే ధర్మశ్రీ

విశాలాంధ్ర - చోడవరం : ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చోడవరం నియోజకవర్గ పరిధిలో జరిగిన ఓటింగ్ సరళి పై చర్చించేందుకు ఈనెల 20వ తేదీన చోడవరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఎందుకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థి కరణం ధర్మశ్రీ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. మండలాల వారిగా జరిగే ఈ సమస్యలో బూతు స్థాయి నుంచి జరిగిన ఓటింగ్ సరళి, వైసిపికి లభించే ఓట్ల శాతం తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు రోలుగుంట మండలం, 11 గంటలకు రావికమతం మండలం, రెండు గంటలకు బుచ్చయ్యపేట మండలం, నాలుగు గంటలకు చోడవరం మండలం లో గల కార్యకర్తల నాయకులతో సమీక్ష నిర్వహించడం జరుగుతది అన్నారు. కాబట్టి ఈ సమావేశానికి పోలింగ్ కేంద్రాల్లో చివరలో ఎన్ని ఓట్లు పోలయ్యాయి అనే విషయాన్ని తెలియజేస్తూ ఎన్నికలు అందజేసిన ఫారం 17 సి ఫారాలను విధిగా తీసుకురావాలని సూచించారు.

పాండురంగడికి శఠగోపం.......

-ఆస్తులు బారెడు........ఆదాయం బెత్తెడు

-దుకాణాలకు నామమాత్రపు అద్దెలు

-భూములకు మొక్కుబడి వేలంపాటలు

విశాలాంధ్ర - పాయకరావుపేట : పట్టణంలోని శ్రీరాధా, రుక్మిణీ సమేత పాండురంగస్వామి దేవస్థానం ఆస్తులు బారెడు ఉన్నా వాటి వల్ల వచ్చే ఆదాయం బెత్తెడుగానే ఉంటున్నాయి. దేవస్థానంకు చెందిన దుకాణాల్లో నామమాత్రపు అద్దెలు వసూలు చేస్తుండగా, భూములకు మొక్కుబడి వేలంపాటలు వేస్తూ పాండురంగడుకే శఠగోపం పెడుతున్నారు. వివరాలాలిలా ఉన్నాయి. పాయకరావుపేట పట్టణంలో ఉన్న శ్రీరాధా,రుక్మిణి సమేత పాండురంగస్వామి దేవస్థానానికి ఎంతో చరిత్ర ఉంది. అన్నవరం సత్యన్నారాయణస్వామి దేవస్థానంలో పెళ్లిళ్లు ఏ విధంగా జరుగుతాయో, అదే విధంగా ఇక్కడ ఉన్న పాండురంగస్వామి దేవస్థానంలో కూడా ఇంచుమించు అదే విధంగా పెళ్లిళ్లు జరుగుతుంటాయి. దేవస్థానంకు దాతలు ఇచ్చిన భూముల విలువ కోట్లలో ఉన్నప్పటికి వాటి వల్ల వచ్చే ఆదాయం వేలల్లో ఉంది. దేవస్థానంకు చెందిన దుకాణాలకు నామమాత్రంగానే అద్దెలు వసూలు చేస్తున్నారు. దేవస్థానంకు చెందిన భూములు 8చోట్ల 32.86 ఎకరాలు ఉండగా వీటి ద్వారా కేవలం రూ.2.20లక్షలు మాత్రమే ఆదాయం వస్తుంది. అలాగే తుని, పాయకరావుపేటలలో 40దుకాణాలు ఉండగా రూ.14.59లక్షలు ఆదాయం వస్తుంది. దేవస్థానంకు చెందిన భూములు లీజు పద్ధతిపై మూడేళ్లకు ఒకసారి నిర్వహించే వేలంపాటలు పరిశీలిస్తే తుని మండలం, ఎస్.అన్నవరం గ్రామంలో సర్వే నెంబరు 191/1లో 0.82, 192/2లో 1.68 ఎకరాలకు రూ.9,100 వేలం పాటలు ఖరారు చేశారు. బొద్దవరంలో సర్వే నెంబరు 114లో 2.66 ఎకరాలకు రూ.13,100కు వేలంపాట ఖరారు చేయగా, ఎస్.సూరవరం సర్వే నెంబరు 325/3లో 2.50ఎకరాలకు రూ.23,500 వేలంపాట ఖరారు చేశారు. ఎస్.రాయవరం పెనుగొల్లులో సర్వే నెంబరు 201/9లో ఎకరా భూమికి రూ.8వేలు వేలంపాట ఖరారు చేయగా, పాయకరావుపేట మండలంలోని శ్రీరాంపురం సర్వే నెంబరు 160/2లో 3.66ఎకరాలకు రూ.23,500, 103/4 సర్వే నెంబరులో 1.93ఎకరాలకు రూ.18,100, వెంకటనగరం గ్రామంలో సర్వే నెంబరు 105లోని 8.66ఎకరాలకు రూ.56,500, అరట్లకోట గ్రామంలో సర్వే నెంబరు 136/3, 176 సర్వే నెంబర్లలో 5.15ఎకరాలకు రూ.68వేలు వేలంపాటలు గతంలోనే ఖరారు చేశారు. అలాగే మరువాడ గ్రామంలో సర్వే నెంబరు 112/2లోని 4.80ఎకరాలకు చెందిన భూమి కోర్టులో కేసు నడుస్తుంది. దేవస్థానం ఆనుకొని ఉన్న కళ్యాణ మండపానికి రూ.6.60లక్షలకు వేలంపాట ఖరారు చేశారు. అలాగే పాయకరావుపేటలో దేవస్థానాన్ని ఆనుకొని ఉన్న దుకా ణాల్లో ముందు ఉన్న 30 దుకాణాల్లో 14 దుకాణాలకు రూ.5,600 చొప్పున, వెనుక ఉన్న 15 దుకాణాలకు రూ.1,350 చొప్పున, ఒక దుకాణానికి రూ.770 నామమాత్రపు అద్దెలు వసూలు చేస్తున్నారు. అలాగే తునిలో ఉన్న 10 దుకాణాలకు రూ.2,500 నుండి రూ.13 వేలు అద్దెలు వసూలు చేస్తున్నారు. దేవస్థానంకు చెందిన అద్దెలు ప్రస్తుత మార్కెట్‌తో పోలిస్తే నామమాత్రంగానే ఉన్నాయి. కనీసం మార్కెట్ అద్దెలతో పోలిస్తే 25శాతం కూడా వసూలు చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి ఉన్న వారికి అద్దెలు పెంచుకుంటూ పోతున్న దేవస్థానం అధికారులు కొత్తగా టెండర్లు పిలవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవస్థానం భూములకు, దుకాణాలకు ఆదాయం పెంచే విధంగా దేవదాయ శాఖ అధికారులు, నూతన పాలకవర్గం చర్యలు తీసుకోవాల్సి ఉందని పలువురు కోరుతున్నారు.

జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర - మాడుగుల : మాడుగుల ఘాట్ రోడ్ జంక్షన్లో ఆదివారం ఉదయం మాడుగుల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో మాడుగుల నియోజకవర్గం జనసేన పార్టీ సంబంధించి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాయపురెడ్డికృష్ణ మాట్లాడుతూ ఈ సార్వత్రిక ఎన్నికల్లో జనసేన తరపున జనసైనికులు ప్రతీ ఒక్కరు రాత్రి పగలు కష్టపడి పనిచేసి కూటమి అభ్యర్థులు గెలిపించ విధంగా బాగా కష్టపడి పని చేశారని, వారందరికీ అభినందనలు తెలిపారు. మనుముందు జనసేనకు సంబంధించిన అన్ని కార్యక్రమాల్లోనూ ఐక్యతను, కృషిని కొనసాగిద్దామన్నారు. ఎన్డీఏ కూటమి జూన్ 4వ తేదీ తర్వాత పక్క ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అనకాపల్లి జిల్లా మొత్తం ఎన్డీఏ కూటమి అభ్యర్థులే గెలుస్తారని రాక్షస పాలన పోయి రామరాజ్యం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీడికాడ మండల పార్టీ అధ్యక్షులు జీవీ.మూర్తి, జనసేన ప్రధాన కార్యదర్శి దాసరి అచ్యుతరావు, ప్రధాన కార్యదర్శి తాటికొండ రామకృష్ణ, ఉపాధ్యక్షులు కోన శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాజు, కామిశెట్టి గణేష్, పాము నాగరాజు, రాజారెడ్డి, చుక్కపల్లి కృష్ణ, బోయపాడు ప్రసాద్, కె.హేమంత్, ఎం.పవన్, కన్నబాబు, సూరిబాబు, గుమ్మాల నానాజీ,పిల్ల సత్యనారాయణ పిల్ల నాయుడు,కాంతారావు,కెవి మూర్తి,గుమ్మాల అప్పలనాయుడు, చీడికాడ మండల నాయకులు గుమ్మడి సంతోష్, కఅప్ష సూరిబాబు, కొండలరావు, రాజు, విజయ్ పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం

విశాలాంధ్ర - పాయకరావుపేట : వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా పాయకరావుపేట శాఖ గ్రంథాయలంలో ఆదివారం విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు తెలిపారు. అలాగే విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.సీతారా మయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.